భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 15.0



తాడేపల్లిగూడెంలో శాశ్వత ప్రాతిపదిక మంత్రి కొట్టు పేరిట ఏర్పాటు చేసిన హోర్డింగ్స్

ఫ్లెక్సీ పోరులో..

వైసీపీవి ఉంచండి.. ప్రతిపక్షాలవి తీసేయండి !

ఇదీ పట్టణాల్లో అధికారుల తీరు.. పలుచోట్ల వివాదాలు.. ఘర్షణలు

- మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు పన్నులు కట్టకుండా ఏర్పాట్లు
- భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకుల్లో వైసీపీవైతే ఓకేనట !
- తణుకులో ఫ్లెక్సీల రగడ తారస్థాయికి.. టీడీపీవి తొలగింపుపై ఆరిమిల్లి ఆగ్రహం
- అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా ఏర్పాట్లు.. పలుచోట్ల ప్రమాదాలు

ఆంధ్రజ్యోతి ఫోకస్

భీమవరం టౌన్/నరసాపురం/తాడేపల్లిగూడెం అర్బన్/తణుకు/పాలకొల్లు, ఫిబ్రవరి 16 : ఒకప్పుడు తమ అభిమాన సినీ హీరోల సినిమాలు విడుదల అవుతున్నప్పుడు థియేటర్ల వద్ద భారీ కటౌట్‌లు పెట్టి సంబరాలు చేసుకునేవారు. పట్టణాల్లోని వ్యాపార ప్రకటనల కోసం భారీ హోర్డింగ్స్ ఏర్పాటు చేసి మునిసిపాలిటీలు ఆదాయం పొందుతుండేవి. తర్వాత ఫ్లెక్సీల రాకతో పుట్టిన రోజులు, పండుగలకు పార్టీల ముఖ్య నేతల రాకను పురస్కరించుకుని శుభాకాంక్షలు, స్వాగతాలు చెబుతూ భారీగా ఏర్పాటు చేస్తున్నారు. పెళ్ళిళ్ళ సమయంలో ఇదే తంతు నడుస్తోంది. ముఖ్య నాయకుల జన్మదిన వేడుకలు వస్తే చాలు పట్టణ వీధులు, మార్కెట్‌లు, ముఖ్య కూడళ్లలు బ్యానర్లు, ఫ్లెక్సీలతో నిండిపోతున్నాయి. కొన్ని సమయాల్లో వీటి తొలగింపులో వివాదాలు చోటు చేసుకుంటున్నాయి.

నరసాపురంలో ఫ్లెక్సీ వార్

నరసాపురం పురపాలక సంఘం అధికారులు గత ఏడాది ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. వీటిలో వైసీపీ నేతలవి వదిలేసి, కేవలం జనసేన, టీడీపీ నేతల ఫ్లెక్సీలను తొలగించడంతో పెద్ద వివాదం చెలరేగింది. రెండు పార్టీలు ధర్నాకు దిగాయి. ఆ సమయంలో కమిషనర్ వెంకటేశ్వరావు అన్ని పార్టీలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏ ఫ్లెక్సీ బ్యానర్ కట్టినా.. వారం రోజుల్లో తొలగించాలని నిబంధన పెట్టారు. కాని, ఇది నేటికి అమలు కావడం లేదు. ఒక్క నరసాపురమే కాదు.. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని పురపాలక సంఘాల్లోనూ ఇదే తంతు జరుగుతోంది. మునిసిపల్ నిబంధనల ప్రకారం ఈ ఫ్లెక్సీలు, బ్యానర్లను ఏర్పాటు చేసుకునే ముందు అనుమతి తీసుకోవాలి. ఎంత సైజు, ఎన్ని రోజులు పెడతామన్నది తెలియజేసి దానికి సంబంధించిన పన్ను చెల్లించాలి. ఆ తర్వాతే వీటిని ఏర్పాటు చేసుకోవాలి. అయితే ఈ నిబంధనలు ఎక్కడా అమలు జరగడం లేదు. ఈ కారణం గా పురపాలక సంఘాలు ఏటా లక్షలాది రూపాయిల పబ్లిసిటీ ఆదాయాన్ని కోల్పోతున్నాయి.



తొలగించిన ఫ్లెక్సీలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న పురపాలక సిబ్బంది(ఫైల్‌ఫొటో)

ఎన్నికలు సమీపిస్తున్న తరుణం లో అన్ని ప్రధాన పార్టీలు పోటాపోటీగా ఫ్లెక్సీ లు పెట్టి ప్రచారాన్ని చేసుకుంటున్నాయి. వీటిలో అధికార పార్టీ ఒక అడుగు ముందంజలో ఉంటుంది. ఎన్నికల కోడ్ వరకు తీసే అవకాశం లేకపోవడంతో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రచారానికి దిగుతున్నారు. వీటిలో కొన్నింటికి పన్ను కడుతుంటే.. మరికొన్నింటికి ఎటువంటి ట్యాక్స్ చెల్లించడం లేదు. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్న స్థానిక సంస్థలు పబ్లిసిటీ పన్ను ఆదాయాన్ని పెంచుకునేందుకు శ్రద్ధ చూపితే.. ఏటా లక్షలాది రూపాయల ఆదాయం ఖజానాకు వస్తుంది. ఆ దిశగా చట్టాలను కఠినతరం చేయాలన్న వాదనలు లేకపోలేదు.

భీమవరంలో అడ్డదిడ్డంగా..

భీమవరం మునిసిపాల్టీకి ఎవరైనా కొత్తవారు వచ్చి చూస్తే



భీమవరంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, బ్యానర్లు

రోడ్డుకు అడ్డదిడ్డంగా బ్యానర్లు, స్తంభాలకు కటౌట్‌లు, భారీ హోర్డింగ్‌లు కనిపిస్తాయి. వాటిని చూసి మునిసిపాల్టీకి భారీగా ఆదాయం వస్తుందనే అంచనా వేసుకుంటారు. అయితే ఇక్కడి పరిస్థితి వేరు. మునిసిపాల్టీకి అనుమతి కోసం దరఖాస్తులు, సంబంధిత సొమ్ములు కట్టేవారు కనిపించరు. వాస్తవానికి ఏటా హోర్డింగ్‌ల ద్వారా రూ.12 లక్షలు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా. కాని, రోడ్డు మార్జిన్‌లో కట్టే బ్యానర్లు, కటౌట్‌ల నుంచి సొమ్మును టౌన్ ప్లానింగ్ అధికారులు వసూలు చేయాలి. బ్యానర్లకు సంబంధించి ఎలాంటి రుసుము, చెల్లింపులు లేవు. రాజకీయ నాయకుల బ్యానర్లు, షాపుల ఓపెనింగ్‌ల బ్యానర్లను రోడ్డుకడ్డంగా కట్టేసినా ఎవరూ అడగరు. ఎలాంటి పైకం వసూలు చేయరు. 100 బ్యానర్లు కడితే 20 రోజులకు వెయ్యి రూపాయలు చెల్లించాలి. కాని నాలుగేళ్లుగా ఎలాంటి రుసుము చెల్లింపులు లేవు. పైగా అధికారపక్షం వాటికి ప్రత్యేక అవకాశాలు కల్పిస్తారు. ప్రతిపక్షాల బ్యానర్లు, కటౌట్‌లకు అయితే తొలగించాలనే ఒత్తిళ్లు అధికారులపై ఉంటుంది. దీంతో ప్రతిపక్ష పార్టీలు అధికారులతో వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. భీమవరం జిల్లా కేంద్రమైన తర్వాత మాత్రం రోడ్డుకు అడ్డంగా కట్టిన బ్యానర్లను కొద్ది రోజులు గడువిచ్చి టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగిస్తున్నారు.

తాడేపల్లిగూడెంలో శాశ్వతంగా..

తాడేపల్లిగూడెంలో అధికార పార్టీ నేత ఫ్లెక్సీలను శాశ్వతంగా ఏర్పాటు చేశారు. అదే ప్రతిపక్షాలవైతే వారం తిరగకుండానే తొలగిస్తున్నారు. గతంలో ప్రతిపక్ష నాయకుడి పుట్టిన రోజు ఫ్లెక్సీలను అభిమానులు ముందురోజు పెట్టారు. తెల్లారే సరికి వాటిని అధికారులు తొలగించారు. అధికార పార్టీ నేత ఆదేశాల మేరకే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు రంగం లోకి దిగారు. నూతన, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపే ఫ్లెక్సీల విషయంలోనూ ఇదే తరహాలో వ్యవహరిస్తున్నారు. కాని, అధికార పార్టీకి నేత ఫ్లెక్సీలకు మాత్రం అవకాశం కల్పిస్తున్నారు. ఇప్పటికీ హౌసింగ్ బోర్డు నుంచి జయలక్ష్మి థియేటర్ వరకు డివైడర్ మధ్యలో వున్న సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు అధికార పార్టీ నేత ఫ్లెక్సీలను శాశ్వతంగా పెట్టారు. వాటిని మాత్రం ఇప్పటికీ అధికారులు తొలగించలేదు.

తణుకులో తరచూ వివాదాలు

తణుకు పట్టణంలో అధికార పార్టీ చిన్న నాయకుడి నుంచి పెద్ద నాయకుల వరకు ఏ కార్యక్రమమైనా భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. వాటిని నెలల తరబడి అలాగే ఉంటున్నా మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. అదే ప్రతిపక్ష పార్టీ నేతల ఫ్లెక్సీలపై మాత్రం ఏర్పాటు చేసిన రోజుల వ్యవధిలోనే వాటిపై అధికారులు కన్ను పడుతోంది. వెంటనే వాటిని తొలగిస్తున్నారు. క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి వేడుకలకు సంబంధించి టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల విషయంలో వాటిని అధికారులు తొలగించినపుడు వివాదం ఏర్పడింది. అధికార పార్టీ నేతలు మాత్రం సెంటర్ లైటింగ్‌లు ఉన్న వేల్పూరు రోడ్డు, రాష్ట్రపతి రోడ్డు, ఆర్‌వోబీ, ఫైడిపర్రు రోడ్లపై ఏడాది పొడవునా పట్టించుకునేవారు లేరు. అదే పోల్స్‌కు వేరే వారు పెట్టుకుంటే మాత్రం అధికారులు సహించడం లేదు. వారు అధికార పార్టీ నేతకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు.



తణుకులో అధికార పక్షానివి వదిలేసి.. కేవలం టీడీపీ ఫ్లెక్సీలను మాత్రమే తొలగిస్తుండడంతో ఆందోళనకు దిగిన మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి, టీడీపీ నేతలు

పాలకొల్లులో ప్రచార పిచ్చి



పాలకొల్లులో చాలా రోజులుగా వున్న జగన్ సిద్ధం ఫ్లెక్సీ

పాలకొల్లు గాంధీబొమ్మల సెంటర్ మొదలుకుని కెనాల్ రోడ్డులో ఇరు వైపులా ఫ్లెక్సీలను కట్టడమే కాకుండా సెంటర్ డివైడర్‌ను వదలడం లేదు. సెంటర్ డివైడర్లపై ఫ్లెక్సీల ఏర్పాటుతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. స్మశాన బోర్డులు, పబ్లిక్ పాయకానాలపై అధికార పార్టీ నాయకులు మరింతగా రెచ్చిపోయి తమ అధినాయకుడు జగన్‌కంటే ఎక్కువ ప్రచారం పొందాలనే ఉద్దేశంతో ఫ్లెక్సీలతో ముంచెత్తి కాలుష్య కేంద్రాలుగా మారుస్తున్నారు. అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహ రిస్తున్న పలు శాఖల అధికారులు ఫ్లెక్సీలను అదుపు చేయాలని పరిమిత సంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటుకు అనుమతి ఇస్తే స్థానిక సం స్థల పన్ను వసూలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

తణుకులో అధికారుల హైడ్రామా.. రోజంతా ఆరిమిల్లి నిరసన

తణుకు, ఫిబ్రవరి 16 : తణుకు నరేంద్ర సెంటర్‌లోవున్న టీడీపీ ఫ్లెక్సీలను తొలగించేందుకు మునిసిపల్ అధికారులు గురువారం అర్ధరాత్రి వచ్చారు. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని అధికారులపై మండిపడ్డారు. మంత్రి కారుమూరి ప్రోద్బలంతోనే అధికారులు తమ పార్టీ నేతల ఫ్లెక్సీలను తొలగించేందుకు వచ్చారని మండిపడ్డారు. మహిళా అధికారులను సైతం అర్ధరాత్రి రోడ్లపైకి పంపించి ఫ్లెక్సీలను తొలగించాలని చెప్పడం అన్యాయమన్నారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక మున్సిపల్ మహిళా అధికారి మౌనంగా తలదించుకోవాల్సి వచ్చింది. చివరకు ఎలాంటి ఫ్లెక్సీలు తొలగించబోమని అధికారులు స్పష్టం చేయడంతో టీడీపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. వివాదం సద్దుమణిగిందని అంతా భావించారు. కాని, మహిళా అధికారులు మళ్లీ శుక్రవారం తెల్లవారుజామున చడీచప్పుడు లేకుండా నరేంద్ర సెంటర్‌లో వున్న ఫ్లెక్సీలను తొలగించారు. ఫ్లెక్సీల తొలగింపు విషయం ఉదయం తెలుసుకున్న ఆరిమిల్లి మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. టీడీపీ ఫ్లెక్సీలను తొలగించి, అధికార పక్షానివి ఎందుకు వదిలేశారని, వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఉదయం 11 గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు మునిసిపల్ కార్యాలయంలోనే బైఠాయించి నిరసన తెలిపారు. చివరకు మునిసిపల్ కమిషనర్ బీవీ రమణ ఆరిమిల్లితో ఫోన్‌లో మాట్లాడి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మాటలు కాదని, రాతపూర్వకంగా ఇవ్వాలని చెప్పడంతో వచ్చే సోమవారం వరకు ఎలాంటి ఫ్లెక్సీలు తొలగించమని రాతపూర్వకంగా టీపీవో హేమ లత, మేనేజర్ జయకర్ రాసి ఇచ్చారు. దీంతో ఆరిమిల్లి నిరసన విరమించారు.

తొలగించాల్సి వస్తే రెండూ తీసేయండి

ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ 'తణుకులో ఎప్పుడూ లేని కొత్త సంస్కృతిని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తీసుకొచ్చారు. ఫ్లెక్సీలను తొలగించాల్సి వస్తే అన్నింటిని తొలగించాలి. అలా కాకుండా కారుమూరి ఒత్తిడి మేరకే కేవలం టీడీపీ ఫ్లెక్సీలను తొలగించడం సరికాదు. మున్సిపల్ అధికారులు నిష్పక్షపాతంగా పనిచేయాలి. కమీషనర్ ఇచ్చిన హామీ మేరకు ఆందోళన విరమిస్తున్నాం' అని తెలిపారు. ఆందోళనలో టీడీపీ నాయకులు కలగర వెంకటకృష్ణ, బసవా రామకృష్ణ, డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, పితాని మోహన్, తమరాపు సత్యనారాయణ పాల్గొన్నారు.



మునిసిపాలిటీలో బైఠాయింపు



సూర్యప్రభ వాహనంపై ఉభయ దేవేరులతో ఆశీనులైన శ్రీవారికి హారతులు ఇస్తున్న అర్చకులు

-7లో..

పశువుల చెరువు ఆధునికీకరణకు మోకాలడ్డు



పాపం.. పశువులు ఏం చేశాయ్ !

వీరవాసరం, ఫిబ్రవరి 16 : మండలంలో పశుసంపద, పశుపోషక రైతులు అధికంగావున్న గ్రామం మత్స్యపురి. కాని, ఇక్కడ పశువులు తాగేందుకు కనీసం నీరు లేని పరిస్థితి. 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.3.50 లక్షలతో పశువుల చెరువు ఆధునీకీకరణకు ప్రతిపాదనలు చేసి, సాంకేతిక ఆమోదం కోసం పంపారు. కాని, ఏడాదిగా అది లభించడం లేదు. శాఖాధికారులు సరైన కారణాలను తెలియజేయడం లేదు. సాంకేతిక మంజూరు ఇవ్వటంలో అధికారుల నిర్లక్ష్యం అవగతమవుతోందని పంచాయతీ ప్రతినిధి ఆవేదన చెందుతున్నారు. స్పందనలోనూ ఫిర్యాదులు చేసినా, అధికారులను కలిసినా సాంకేతిక అనుమతులు ఇవ్వడం లేదు. దీనితో 15 నెలలుగా పశువులకు తాగు నీరు లేని పరిస్థితి. చెరువును ఎండగట్టడం వల్ల చెరువు తవ్వకానికి అనుకూలంగా ఉంది. ఈ చెరువు మెత్తం గడ్డితో నిండి ఉంది. పశువులను గ్రామానికి దూరంగా వున్న గొంతేరు పరీవాహక ప్రాంతానికి, మురుగుకోడు, మత్స్యపురి పంట కాలువ వద్దకు తీసుకువెళుతున్నారు. మత్స్యపురి జనసేన ఆధిపత్యంలో, వైసీపీకి ప్రతికూలంగా ఉండటమే కారణమని రైతులు విమర్శిస్తున్నారు. రాజకీయ విభేదాలను పశువులపై చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతా.. మా ఇష్టం !

- అన్నింటా వైసీపీ నేతల పెత్తనం.. శంకుస్థాపనలూ వారి చేతుల మీదే
- చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజాను పక్కనబెట్టి మరీ సిత్రాలు
- స్థానిక సంస్థల్లోనూ ఇష్టారాజ్యం.. కళ్లు మూసుకున్న యంత్రాంగం
- అసలు సమస్యలన్నీ తెరమరుగే.. ఎన్నికల వేళ బదిలీలతో ఇంకో సమస్య

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఎన్నికల వేళ సమస్యలు మరుగున పడుతున్నాయి. మాటలు కోటలు దాటుతున్నాయి. రాబోయే ఎన్నికల్లో కాబోయే అభ్యర్థులు అప్పుడే ఎమ్మెల్యేలైనట్టు, ఎంపీ పీఠ మెక్కేసినట్టు అధికారికంగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేస్తున్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ప్రత్యేకించి ఈ తమాషా జరుగుతోంది. అక్కడ అధికార సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజాకు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు లేదని తేల్చారు. ఆయన స్థానంలో పోటీ చేయబోయే అభ్యర్థిని ప్రకటించారు. ఎమ్మెల్యే పదవీ కాలం మరో రెండు నెలలు మిగిలి ఉండగానే ఏలూరు లోక్‌సభ వైసీపీ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్, చింతలపూడి సమన్వయకర్త కె.విజయరాజు రంగంలోకి దిగారు. అధికారులు దగ్గరుండి మరీ వీరిద్దరితో పునాదిరాళ్ల వేయిస్తూ ప్రారంభోత్సవాలు చేయిస్తున్నారు. ప్రభుత్వ నియమావళికి విరుద్ధంగా వీరిద్దరూ ఏకపక్షంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటుంటే జిల్లా యంత్రాంగం చూసీ చూడనట్టు వదిలేసింది. ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యే లేదా ఎంపీ లేదా జిల్లా, మండలస్థాయి అధికారులు చేయాల్సిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను ఒక పార్టీ రంగేసుకున్న వ్యక్తులు ఎలా చేస్తారనే ప్రశ్నకు సమాధానం లేదు. వరుసగా రెండు మూడుసార్లు ఈ తరహా ఘటనలు పునరావృతమైనా అధికారులకు కనబడదు, వినబడదు. ఎందుకంటే అధికారపక్షం కాబట్టే.

అన్నింటినీ పక్కనబెట్టి..

• ఎంపీ, ఎమ్మెల్యేలు కాకుండానే..!



కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెంలో గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న వైసీపీ చింతలపూడి ఇన్‌చార్జ్ విజయరాజు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, సిట్టింగ్ ఎంపీ కోటగిరి శ్రీధర్ తదితరులు

ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ తమ ప్రభుత్వం అన్నిటిపైనా స్పందిస్తోందని ఆ పార్టీ నేతలు కలరింగ్ ఇస్తున్నారు. అక్కడక్కడా పునాదిరాళ్లు, మందీ మార్బలం వెంటరాగా, ప్రభుత్వ కార్యక్రమాలపై ఊదర కొడుతున్నారు. ఎప్పుడో గోతులూ గుంతలు పడిన రోడ్లకు కొన్ని చోట్ల మరమ్మతుల పేరిట హంగామా చేస్తున్నారు. అసలు సమస్యలను పక్కనబెట్టేశారు. రబీలో లక్షలాది ఎకరాలకు నీరందించాల్సిన పరిస్థితులపై సమీక్ష ఊసే లేదు. రబీ ఆలస్యంగా ఆరంభం కావడం, ఫిబ్రవరి రెండో వారం నాటికి గానీ నాట్లు పూర్తి కాకపోవడంతో నడి వేసవి నాటికి కోతకు వచ్చే అవకాశాలున్నాయి. ఎల్‌నినో ప్రభావం కారణంగా పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయంటూ వాతావరణ శాఖ హెచ్చరికలుండగా, దీనికి అను గుణం గా గోదావరిలో నీటి లభ్యత, సరఫరా ఆసాంతం కొన సాగుతాయా లేదా అనే సందేహాలకు తావిచ్చింది. గతే డాదే నీటి సరఫరాలో అనేకచోట్ల ఆటంకాలు తొంగి చూశాయి. ముందుచూపుతో రైతులను రబీ వైపు కది లించాల్సి ఉండగా, ఎన్నికల ఏర్పాట్ల పేరిట అధికార యంత్రాంగం క్షణం తీరికలేకుండా గడుపుతోంది. ధాన్యం సేకరణ, రైతులకు నగదు చెల్లింపులు తదితర ఫిర్యాదులు ఇప్పటికే వచ్చి పడుతున్నాయి. వీటిపైన దృష్టే లేదు. టిడ్కో ఇళ్ల పేదలకు అందిస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదు. జగనన్న లేఅవుట్లు, హౌసింగ్ కాలనీల్లో ఎడాపెడా సమస్యలు. ఊరూరా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, పాల కేంద్రాలు వీటన్నిటికీ సొంత భవనాలని ప్రకటించినా అనేకచోట్ల వాటి అడ్రసే లేదు. మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ఇదే తీరు. ఎన్నికల వేళ సమస్య ఎంత తీవ్రమైనా పట్టించుకునే తీరిక అధికారులకు, ప్రజా ప్రతినిధులకు లేకపోయింది.

అంతా.. మారారు

దీర్ఘకాలంపాటు ఒకే జిల్లాలో పనిచేస్తున్న, ఎన్నికల విధులతో సంబంధం వున్న అధికారులందరికీ స్థానచలనం చేశారు. పొరుగు జిల్లా నుంచి రప్పించి వారికి పోస్టింగులు ఇచ్చారు. స్థానిక పరిస్థితులు తెలుసుకోవడానికి, అవగాహన రావడానికి సమయం పట్టనుంది. ఎన్నికలు జరిగేందుకు మరో 54 రోజులు గడువుండగా ఇప్పటికే పోలీస్, రెవెన్యూ సహా కీలక విభాగాల్లో అధికారులంతా అటూ ఇటూ బదిలీ అయ్యారు. వీరిలో అత్యధికులకు ఇప్పటికే ఎన్నికల శిక్షణ ఆరంభమైంది. తహసీల్దార్లు, ఆర్డీవోలంతా విజయవాడ, విశాఖ శిక్షణా కేంద్రాల్లో ఉన్నారు. రేపోమాపో గానీ వీరు స్వస్థలాలకు చేరుకోలేరు. గడచిన రెండు మాసాలుగా ప్రభుత్వంపై వివిధ వర్గాల తిరుగుబాటు చేస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలంటూ వీధులకెక్కి సర్కారుతో కయ్యానికి సిద్ధపడుతున్నారు.



ప్రజా, రైతు సంఘాల కన్నెర్ర

తాడేపల్లిగూడెంలో ప్రజా సంఘాల భారీ ర్యాలీ



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పర్యవేక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

బాలల హక్కుల పరిరక్షణ బాధ్యత అందరిదీ

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 16: బాలల హక్కుల పరిరక్షణలో అధికారులంతా భాగస్వాములు కావాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావు, సభ్యులు జంగం రాజేంద్రప్రసాద్ సూచించారు. ఏలూరులో శుక్రవారం ఉత్తరాంధ్ర జిల్లాల స్త్రీశిశు సంక్షేమశాఖ, బాలల సంరక్షణ విభాగాలు, కార్మిక, విద్య, పోలీస్, వైద్యఆరోగ్య తదితరశాఖలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమన్వయ సమావేశం జరిగింది. ఇటీవల కాలంలో నమోదైన బాలకార్మికుల కేసులు, ప్రభుత్వం అందిస్తున్న నిధులు, చేపట్టిన చర్యలపై చైర్మన్ ఆరా తీశారు. ఆరు జిల్లాల్లో జరిగిన బాల్యవివాహాలు, పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు, చట్టంపై నిర్వహించిన సదస్సులు, పోక్సో ఆయా కేసుల్లో జన్మించిన పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు జారీ, తదితర అంశాలపై చర్చించారు. బాలల హక్కులు, వారి సంక్షేమంపై ప్రభుత్వశాఖల సహకారం తదితర వివరాలు సేకరించారు. అప్పారావు మాట్లాడుతూ కమిషన్ తరపున ఏడు జిల్లాల అధికారులంతా బాలల విషయంలో సమన్వయంతో పనిచేస్తూ బాలలహక్కులను, చట్టాల రక్షణకు కృషిచేయాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారిణి సూర్యచక్రవేణి, క్రాప్ ఫౌండేషన్ విజయవాడ డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి, ఆరు జిల్లాల మహిళా శిశుసంక్షేమశాఖ అధికారులు, బాలల సంరక్షణ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంకా జీతాలు రాలేదు

కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల ఆందోళన

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 : జాతీయ ఆరోగ్య పథకం(ఎన్‌హెచ్‌ఎం)కింద ఉమ్మడిజిల్లాలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులైన ఆరోగ్య కార్యకర్తలు (మేల్), యూరోపియన్ కమ్యూనిటీ (ఈసీ) ఏఎన్‌ఎంలు, కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ఇతర సిబ్బందికి జనవరినెల జీతాలు శుక్రవారంవరకు అందక పోవడంతో సంబంధిత ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నెలలో 16 రోజులు గడిచినా జీతభత్యాలు ఇవ్వకపోవడంతో ఉమ్మడిజిల్లాలో సుమారు 400 మందికిపైగా కాంట్రాక్టు ఉద్యోగులు ఆర్థిక ఇక్కట్లను ఎదుర్కొంటున్నారని ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.అప్పారావు, జె.గోవిందరావు ఓ ప్రకటనలో వివరించారు. జీతాలు అందక కుటుంబ అవసరాల నిమిత్తం, పిల్లల ఫీజుల నిమిత్తం, ఇతర ఖర్చుల నిమిత్తం వడ్డీలకు అప్పులు తెచ్చుకుని రోజులు గడుపుతున్నారన్నారు. సీఎం ఇచ్చిన వాగ్దానం మేరకు అర్హులైన వారరందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

19న తాడేపల్లిగూడెంలో ఎస్పీ స్పందన



భీమవరం క్రైం, ఫిబ్రవరి 16 : జిల్లా ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ఆలోచనతో ఈ నెల 19వ తేదీ సోమవారం స్పందన కార్యక్రమం తాడేపల్లిగూడెంలోని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సమస్యలను విన్నవించి పరిష్కరించుకోవాలని కోరారు.

గ్రీవెన్స్ సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో శివన్నారాయణరెడ్డి

భీమవరం ఫిబ్రవరి 16 : సమస్యలను పరిష్కరించుకొనేందుకు ఉద్యోగుల గ్రీవెన్స్ చక్కని వేదికని.. దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి జిల్లాలోని వివిధ మండలాలు నుంచి వచ్చిన ఉద్యోగుల నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టరేట్‌లో ప్రతి నెల మూడో శుక్రవారం నిర్వహిస్తామన్నారు. శుక్రవారం ఐదు దరఖాస్తులు అందాయన్నారు. యలమంచిలి మండలం చించినాడ గ్రామ పంచాయతీ కారదర్శి హరిప్రసాదుకు మేడపాడు, కొంతేరు గ్రామాలకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారని, తనకు ఫిట్స్ వ్యాధి ఉందని ఆ రెండు ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని కోరారు. పాలకొల్లు పురపాలక సంఘ 9వ వార్డు సచివాలయంలో ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీగా పనిచేస్తున్న దిద్దే వెంకటేష్ తనను ఆకివీడు నగర పంచాయతీలో డిప్యూటేషన్ వేశారని తన స్వగ్రామం ఆచంట అని తండ్రి అనారోగ్యంతో ఉన్నారని దగ్గర ఉండి చూసుకోవాలని పాలకొల్లులోనే విధులు నిర్వహించుకునేలా చూడాలని కోరారు. కాళ్ళ మండలం కాళ్ళ గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంటుగా పని చేస్తున్న కె.అరుణ కుమార్ ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బదిలీ చేయాలని కోరారు. జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, జిల్లా కలెక్టరు కార్యాలయ ఏవో పీహెచ్ పాపారావు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి

భీమవరం క్రైం, ఫిబ్రవరి 16 : పోలీస్ సిబ్బంది ఎప్పుడూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటే పోలీసులు ప్రజలకు మెరుగైన సేవలు అందించగలగుతారని జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) భీమారావు అన్నారు. భీమవరం మార్కెట్ యార్డు వద్ద గల గ్రౌండ్ నందు శుక్రవారం సివిల్, ఏఆర్, హోంగార్డు సిబ్బందికి మొత్తం 89 మందికి పరేడ్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ శారీరకంగా దృఢత్వం కలిగి ఉండడానికి వ్యాయామం, యోగా ప్రతీ రోజు చేయాలన్నారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ శుక్రవారం సిబ్బంది సంక్షేమ దివస్‌ను నిర్వహిస్తున్నారని ఏదైనా సమస్యలు ఎస్పీ దృష్టికి తీసుకుని వస్తే సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు. సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

మళ్లీ పులి భయం

కన్నాపురంలో ఆవు దూడపై దాడి

పోలవరం, ఫిబ్రవరి 16 : ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల, గోపాలపురం, పోలవరం, బుట్టాయిగూడెం మండలాల్లో రెండు నెలలుగా పాడి పశువులపై దాడులకు పాల్పడిందంటూ ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురి చేస్తూ ఇటు అటవీ శాఖను ముప్పుతిప్పలు పెట్టిన పులి గురువారం కన్నాపురం పరిధి రేంజ్‌లో ఆవుదూడపై దాడికి పాల్పడడంతో ప్రజల్లో భయం మొదలైంది. కొన్ని రోజుల క్రితం పులి కొవ్వాడ, ఉడతపల్లిలో పాడి పశువలపై దాడులు చేసిన అనంతరం పాపికొండల అభయారణ్యంలోకి వెళ్ళిపోయిందని అటవీశాఖ అధికారులు ప్రకటించడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజల్లో తాజాగా కన్నాపురంలో పులి దాడి సమాచారంతో మళ్లీ భయం పట్టుకుంది. కన్నాపురం రేంజ్‌లో ఆవుదూడపై దాడి చేసి 95 శాతం తినేసింది. పులి మంచి ఆకలి మీద ఉన్నట్లుగా అర్థమవుతుందని ఆ పరిస్థితుల్లో మనుషులు ఎదురుపడినా అంతే సంగతులని ఏజన్సీ గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పులి సంచారం అంచనా వేయలేమని సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటవీశాఖ సిబ్బంది తగు రక్షణ చర్యలు తీసుకుంటున్నారని అటవీ క్షేత్రాధికారి ఎస్.దావీదురాజు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయం.. ఒకరి అరెస్టు

ముసునూరు, ఫిబ్రవరి 16: మండలంలోని కొర్లకుంటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నిందితుడిని శుక్రవారం ముసునూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికుడైన చౌటపల్లి ప్రసాద్‌రావు ఇంటివద్దే అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని అందిన సమాచారంతో ఎస్సై పి.వాసు తన సిబ్బందితో దాడి చేశారు. 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడు ప్రసాద్‌రావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని నూజివీడు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

రొయ్యి రైతుకు షాక్!

కొన్ని గంటల్లోనే కిలోకు రూ.40 ధర తగ్గింపు
ఆకస్మికంగా తగ్గడంపై రైతుల ఆందోళన
ఉద్దేశపూర్వకంగా తగ్గించారనే ఆరోపణ
ఉమ్మడిగా పోరాటానికి నిర్ణయం

భీమవరం, ఫిబ్రవరి 16 : ఆశాజనకంగా ఉందనుకున్న కొన్ని గంటల్లోనే కిలోకు 40 రూపాయలు పడిపోవడం రొయ్య రైతులను విస్మయానికి గురి చేసింది. మార్కెట్లో పరిస్థితులు వల్ల తగ్గిందా? ఉద్దేశపూర్వకంగా ధర కోత వేశారా ? నాలుగు రోజులుగా మార్కెట్లో రొయ్య ధర తగ్గింపుపై ఆక్వా రైతులు పడుతున్న తర్జన భర్జన ఇది. ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని రెండు రోజులుగా ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రొయ్య రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మొన్నటి బుధవారం భీమవరంలో సమావేశం నిర్వహించారు. ధర తగ్గడంపై ట్రేడర్ల నుంచి సమాచారం సేకరించారు. కారణాలు ఆరా తీస్తూ దశలవారీ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.ఈనెల 12వ తేదీన ఉదయం 10 గంటల వరకు రొయ్యల ధరలు ఆకస్మికంగా తగ్గి పోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం 30 కౌంటు రొయ్యలు 480 రూపాయలు పలికింది.. కొన్ని గంటల్లోనే అది 40 రూపాయలు తగ్గి 440 వద్ద ఆగింది. ఇది ఉద్దేశపూర్వకంగానే వ్యాపారులు చేసిన పనేనని రైతులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు కొన్ని రకాల కౌంట్ రొయ్యలను కొనడం లేదని కూడా రైతులు చెబుతున్నారు. వాస్తవంగా మార్కెట్లో రొయ్యలు ధరలు స్థిరంగా కొన సాగాలని గతేడాది ప్రభుత్వం కొన్ని మార్గ దర్శకాలని జారీ చేసింది. వంద కౌంటు రొయ్య రూ.240 తగ్గకుండా కొనసాగాలని ఆదేశాలిచ్చారు. ఏడాది కాలంగా ఈ ఆదేశాలు ఒకటి రెండు సార్లు మినహా అమలుకు నోచుకోలేదు. ఓ దశలో రూ.195లకు పడిపోయింది. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులకు అను గుణంగా రొయ్య ధరల్లో హెచ్చు, తగ్గులు ఉంటాయి. గత నెలలో కాస్త ధరలు పెరిగి ఆశాజనకంగా కొనసాగుతున్న తరుణంలో కొన్ని గంటల్లోనే ధరకు భారీ కోత విధించడం పైనే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆక్వా ప్లాంట్ల యజమానుల నిర్ణయంగా దీనిని చెప్తున్నారు. రైతు సమస్యలపై నాలుగేళ్లుగా పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన రొయ్య రైతుల సంక్షేమ సంఘం ఈసారి ధరల గురించి అధికారులు దృష్టికి తీసుకు వెళ్లాలని నిర్ణయించినట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి జీకేఎఫ్ సుబ్బరాజు తెలిపారు. రాష్ట్రంలో పలు రైతు సంఘాలు ఉన్నాయి. సంఘాలన్నీ రైతు సమస్యలపై పోరాటం చేస్తున్నందున ఈసారి ఒకే వేదికగా ఏర్పాటై, ఐక్యంగా ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయిం చుకున్నారు. ఇప్పటికే రెండు మూడు సమావేశాలు ఏర్పాటు చేశారు. త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుని తదుపరి కార్యాచరణకు వెళ్లాలని నిర్ణయించారు.

కౌంట్	పాత	కొత్త
(ధరలు రూపాయల్లో)		
30 కౌంట్	480	440
40 కౌంటు	415	390
50 కౌంటు	355	340
60 కౌంటు	315	300
70 కౌంట్	295	280
80 కౌంట్	270	260
90 కౌంటు	260	250
100 కౌంట్	250	240


భీమవరంలో మూడు రోజుల క్రితం సమావేశమైన రొయ్య రైతులు






సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు.. పెండ్లి కొడుకును చేస్తూ బుగ్గన చుక్క పెడుతున్న అర్చకులు.. రాజావారి వీధికి రథాన్ని లాగుతున్న భక్తులు

లక్ష్మీనరసింహుని కల్యాణానికి ఏర్పాట్లు

సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 16: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రథసప్తమి రోజున వార్షికంగా బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు తొలి పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. ఉదయం సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. తిరువారాధన, బాలభోగం, పంచామృత అభిషేకాలు జరిగాయి. అనంతరం స్వామివారి రథానికి పూజలు చేశారు. గంటలు మోగగా భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు. పల్లిపాలెం గ్రామానికి చెందిన వాహన చోదకులు, గ్రామస్తులు, భక్తులు రథాన్ని మెరక వీధి (రాజావారి వీధి)కి చేర్చారు.

కల్యాణ వేడుకలకు శ్రీకారం

శ్రీకర, శుభకర, ప్రణయ స్వరూపుడైన ఆది దేవుడు శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని పెండ్లి కొడుకుగాను, అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను తీర్చిదిద్దారు. విశేష పూజలందుకున్న స్వామి, అమ్మవార్లను అర్చకులు పెళ్లికి సిద్ధం చేశారు. రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు నృసింహ నామచరణాలు, మిరుమిట్లు గొలిపే విద్యుద్దీప కాంతుల నడుమ పురవీధుల్లో ఊరేగారు. రథ సప్తమి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రాకార మండపంపైన ఉదయం అధిక సంఖ్యలో మహిళా భక్తులు సూర్య నమస్కారాలు చేశారు.

అంతర్వేదికి ప్రత్యేక బస్సులు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 16 : అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ ఉత్సవాల సందర్భంగా సోమవారం, మంగళవారం జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి వీరయ్య చౌదరి తెలిపారు. ఈ బస్సులు మలికిపురం వరకు మాత్రమే నడుస్తాయన్నారు. గత ఏడాది జిల్లా నుంచి 81 సర్వీసులను నడిపామని సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే అన్ని డిపోల మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. భీమవరం డిపో నుంచి అంతర్వేదికి 19వ తేదీ సోమవారం నుంచి 20వ తేదీ మంగళవారం వరకూ భక్తుల సౌకర్యార్థం ఉదయం 8 గంటల నుంచి భీమవరం కొత్త బస్టాండ్ నుంచి ప్రతీ 20 నిముషాలకి ఒక బస్ నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి తెలియజేశారు.


చంద్రప్రభ వాహనంపై ఉభయదేవేరులతో ఊరేగిన చిన వెంకన్న

ఆదిత్యునిపై ఆదినారాయణుడు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 16: ప్రభాతవేళ.. సప్త అశ్వాలను శ్రీదేవి, భూదేవి సమేతంగా అధిరోహించిన శ్రీవారు తిరువీధులకు తరలివెళ్లి భక్తులకు అభయ ప్రదానం చేశారు.సాయం సంధ్య వేళ ఉభయ దేవేరులతో చంద్రప్రభ వాహనంపై కొలువుదీరిన స్వామి పురవీధుల్లో ఊరేగారు. రథసప్తమి పర్వదినాన జరిగిన ఈ ఉత్సవాలు భక్తులను పరవశింపచేసింది. ముందుగా ఉదయం సూర్యప్రభపైన, సాయంత్రం చంద్రప్రభపైనా స్వామి, అమ్మవార్లను ఉంచి అలంకరించారు. హారతులిచ్చారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ తిరువీధుల్లో ఊరే గించారు. భక్తుల హారతులు సమర్పించారు. చినవెంకన్న క్షేత్రం శుక్రవారం భక్తులతో కళకళలాడింది. రథసప్తమి పర్వదినం కావడంతో ఆలయానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.


అసంపూర్తిగా సాలిపేట రోడ్డు

ఆయనుంటే.. పనులు చేయలేం

జంగారెడ్డిగూడెంలో చేతులెత్తేస్తున్న కాంట్రాక్టర్లు

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 16: జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో పనులు చేయాలంటే కాంట్రాక్టర్లు పారిపోయే పరిస్థితి నెలకొంది. కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోం దని భవిష్యత్‌లో ఎవరూ వర్కులు చేయడానికి ముందుకు రారని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో అధికారుల చేతులు తడపనిదే సకాలంలో బిల్లులు అవ్వవనే అపవాదు ఉంది. కోట్ల రూపాయల పనులు చేయించుకొని బిల్లులు చేయడానికి అధికారులకు చేతులు రావడం లేదని కొవ్వూరుకు చెందిన కాంట్రాక్టర్ బేతిన వెంకటప్రసాద్ చెబుతున్నారు. కాంట్రాక్టర్లు ఎవరూ రావడం లేదని వర్కులు మొదలుపెడితే బిల్లులు త్వరగా ఇస్తానని 2022లో అప్పటి కమిషనర్ కాంట్రాక్టర్ చెప్పడంతో రెండు కోట్ల రూపాయలతో పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు ప్రసాద్ చెబుతున్నారు. వర్క్ పూర్తి చేసిన వారం రోజుల్లో అధికారులు ఆ వివరాలను సీఎఫ్ఎంఎస్ చేయాల్సి ఉందని అయితే స్థానిక అధికారులు ఎనిమిది నెలల సమయం తీసుకుంటే బిల్లులు ఎప్పుడు తీసుకోవాలని కొందరు కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. బిల్లులు చేయడంలో కమిషనర్ అలసత్వం వహిస్తున్నారని డిసెంబరులో రాజమహేంద్రవరం అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ప్రసాద్ తెలిపారు. అధికారులు కమిషనర్‌కు మెమో అందించినా నేటికీ బిల్లులు సిఎఫ్ఎంఎస్ చేయలేదన్నారు. పట్టణంలోని 21, 22, 23, 24 వార్డులకు అనుసంధానంగా ఉండే సాలిపేట రోడ్డు రూ.70 లక్షల అంచనాలతో గత నెలలో నిర్మాణం మొదలుపెట్టి మధ్యలో వది లేశారు. ఇప్పటి వరకు రూ.7 లక్షల వరకు ఖర్చు అయిందని పాత బిల్లులు వస్తేగాని మిగిలిన వర్కు పూర్తిచేయలేనని కాంట్రాక్టర్ ప్రసాద్ చెబుతున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసవర్మ

21 నుంచి బీజేపీ ప్రజాపోరు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 16: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. పార్టీ నర్సాపురం పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ప్రజా పోరు కార్యక్రమానికి వర్మ ఐదు జిల్లాలకు క్లస్టర్ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలుచేసిన పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లో ప్రచారం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా పోరు భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఆకుల లీలా కృష్ణ, జిల్లా కోఆర్డినేటర్ కోమటి రవికుమార్, భీమవరం అసెంబ్లీ కో-కన్వీనర్ అడబాల శివ, యువ మోర్చా నాయకులు వినోద్ వర్మ పాల్గొన్నారు.


జడ్పీ కార్యాలయ ప్రాంగణంలో పోస్టర్లను ప్రదర్శిస్తున్న సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లానాయకులు

ఓట్ ఫర్ ఓపీఎస్ ఆందోళనకు పోలీసుల మోకాలడ్డు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 : 'ఓట్ ఫర్ ఓపీఎస్' నినాదంతో ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఈ నెల 18న నిర్వహించ తలపెట్టిన చలో విజయ వాడ ఆందోళన కార్యక్రమానికి జిల్లానుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులెవ్వరూ హాజరవ్వకుండా నిలువరించేందుకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఆదివారం జరిగే చలో విజయవాడ ఉద్యమానికి ప్రభుత్వ అనుమతులు లేనందున ఆందోళనకు హాజరుకావద్దని, ధిక్కరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ శుక్రవారం సాయంత్రం నుంచే నోటీసులు జారీచేసే పనిని ప్రారంభించారు.మరోవైపు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చలో విజయవాడ ఉద్యమానికి హాజరయ్యేందుకు ఉద్యోగ సంఘాలు సన్నాహాలు చేసుకుంటున్నాయి. ఓట్ ఫర్ ఓపీఎస్ వాల్ పోస్టర్లను శుక్రవారం ఏలూరు జడ్పీ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. పోలీసు నోటీసులు అందుకున్నవారిలో ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు రెడ్డి రామా రావు, కోశాధికారి మూల్పూరి రాంబాబు, రాష్ట్ర కౌన్సిలర్లు శ్రీనివాస్, బెన్‌హర్, జిల్లా అదనపు అధ్యక్షుడు ఆర్.రామకృష్ణ, డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు తదితరులున్నారు. మిగతా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు శనివారం నోటీసులను జారీచేసే అవకాశం ఉంది.


జిన్నూరు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న దృశ్యం

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

పోడూరు, ఫిబ్రవరి, 16 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని విద్యార్థులు నూటికి నూరుశాతం సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమని మధ్యాహ్న భోజనం పథకం, పాఠశాలల పారిశుద్ధ్య జిల్లా కో-ఆర్డినేటర్ కె.కృష్ణారావు అన్నారు. మండలంలోని జిన్నూరు హైస్కూల్‌లో శుక్రవారం ఆహార పదార్థాలను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రద్ధ తీసుకొని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంఈవోలు జి.విజయ కుమార్, జీవీ.సూర్యనారాయణ, హైస్కూల్ హెచ్ఎం శివజ్యోతి, పాఠశాల కమిటీ చెర్మన్ రమేష్ పాల్గొన్నారు.



కల్యాణ వేదికపైకి స్వామివారిని తీసుకొస్తున్న భక్తులు.. త్రిపురాంతకేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కవిటంలో ఘనంగా అతిరుద్ర మహాయాగం

కన్నుల పండువగా త్రిపురాంతకేశ్వర స్వామి కల్యాణం

పోడూరు, ఫిబ్రవరి, 16 : పోడూరు మండలం కవిటంలో ఆధ్యాత్మిక శోభాయమానంగా అతిరుద్ర మహాయాగం మహోత్సవాలు ఆరో రోజు శుక్రవారం అత్యంత ఘనంగా జరిగాయి. వేద పండితులు రుద్రహోమం పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నెలమూరుకు చెందిన ఉమా రామ లింగేశ్వర ట్రస్ట్, శర్వాణి స్కూల్ ఆధ్వర్యంలో దాతలు, భక్తులు, గ్రామస్తులు సహకారంతో ఆధ్యాత్మికవేత్త జంధ్యాల శ్రీనివాసశర్మ(నెలమూరు శర్మ) పర్యవేక్షణలో ఈ యాగ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రథసప్తమి పురష్కరించుకుని సూర్యనారాయణస్వామికి ప్రీతిగా ప్రత్యేక హోమం పూజలు, సూర్య నమస్కార పూజలు నిర్వహించారు. 56 మంది రుత్వికులచే 1,232 సార్లు రుద్ర పారాయణలు ఈశ్వరునికి అభిషేకం నిర్వహించారు. 25 మంది రుత్వికులచే 84 సార్లు చండీ పారాయణం నిర్వహించారు. రుద్ర హోమం, రుద్ర క్రమార్చన త్రిశతీ అర్చన చండీ హోమం, వేద స్వాహాకారం అరుణ హోమం నిర్వహించారు. త్రిపుర భైరవీ మహా విద్యా మూల మంత్ర హవనం నిర్వహించారు. మేళతాళాలతో, పండితుల మంత్రో చ్ఛరణలతో భక్త జన సందోహం మధ్య కన్నుల పండువగా త్రిపురాంతకం మహాక్షేత్రంలోని త్రిపురాంతకేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు.

మావుళ్ళమ్మకు 8 గ్రాముల బంగారం అందజేత



భీమవరం టౌన్, ఫిబ్రవరి 16 : మావుళ్ళమ్మ అమ్మవారికి శుక్రవారం పట్టణానికి చెందిన పిశిరీషా, శివరామ వర్మ దంపతులు 8 గ్రామల బంగారాన్ని బహూకరించారు.దాతలు అమ్మవారిని దర్శించుకోగా అర్చకులు వారి కుటుంబ సభ్యుల పేరిట పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. శేషవస్త్రాన్ని, ప్రసాదాన్ని అందించారు.మాజీ చైర్మన్ కారుమూరి సత్యనారాయణమూర్తి ఉన్నారు.

రాజకీయాలకు స్వస్తి : కాపా

నూజివీడు, ఫిబ్రవరి 16: ఈ రోజు నుంచి తాను రాజకీయాలకు స్వస్తి చెబుతున్నట్లు నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ నాయకుడు కాపా శ్రీనివాసరావు ప్రకటించారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తనపై, తన కుటుంబీకులపై నిరాధార ఆరోపణలు, అసభ్య పదజాలంతో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వ్యక్తులను, ప్రోత్సహిస్తున్న స్థానిక టీడీపీ ఇన్‌చార్జ్‌లు, నాయకుల వ్యవహార శైలిపై పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్ళినా వారిని అదుపు చేయలేదని, ఇలాంటి రాజకీయాల్లో తాను ఇమడలేనని భావించి రాజకీయాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.


గ్యాస్ బండ్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

గ్యాస్ సిలెండర్లు సీజ్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 16 : గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలెండర్లను ఒక హోటల్‌లో వాడుతున్నట్లు సమాచారం అందడంతో విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ ఆదేశాల మేరకు ఏలూరు శాంతినగర్‌లో ఉన్న అమృత హోటల్‌లో శుక్రవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలెండర్లు (సబ్సిడీ సిలెండర్)లు 10 ఉన్నట్లు గుర్తించి వాటిని సీజ్‌చేశారు. హోటల్ యజమాని బంకపల్లి దుర్గాప్రసాద్‌ను విచారించగా హోటల్ వ్యాపార నిమిత్తం సబ్సిడీ సిలెండర్లను తెలిసిన వారి వద్ద నుంచి 50 రూపాయలు అదనంగా ఇచ్చి కొనుగోలు చేసి తెచ్చుకున్నట్లు తెలిపారు. నిత్యావసరాల చట్టం 1955 కింద కేసు నమోదు చేశారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనునాయక్ వారి సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిపై అత్యాచారం కేసు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 16 : ఒక యువకుడు ప్రేమిస్తున్నానని పెళ్ళి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి పెళ్ళికి నిరాకరించడంతో బాధితురాలు ఏలూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఆ యువకుడిపై అత్యాచారం కేసు నమోదు చేశారు. ఏలూరులోని ఓ ప్రాంతానికి చెందిన వివాహిత(24) పెళ్లయిన రెండు నెలలకే తన భర్తను వదిలిపెట్టి తన పుట్టింటి వద్దే ఉంటున్నది. ఏలూరు బీడీ కాలనీకి చెందిన శ్రీహరి అనే యువకుడు ఆమెకు పరిచయమయ్యాడు. ఇది కాస్తా ప్రేమగా మారింది. ఆమె గర్భం దాల్చింది. పెళ్ళి చేసుకోమంటే ఆ యువకుడు నిరాకరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. టూటౌన్ సీఐ ప్రభాకరరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆ యువకుడిపై అత్యాచారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దింట్లమ్మ పట్టణోత్సవం

ఆకివీడు, జనవరి 28: పెద్దింట్లమ్మ పట్టణోత్సవం బ్రహ్మాండంగా జరిగింది. శుక్రవారం పెద్దింట్లమ్మను ఊరేగింపు సమయంలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రథసప్తమి కావడంతో ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వరీ సహిత మార్కండేయస్వామి ఆలయ ప్రాంగణంలో సూర్య భగవానుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం మేనేజర్ సాగి శ్రీనివాస రంగరాజు, చైర్మన్ బొమ్మా రెడ్డి మాధవరెడ్డి, డైరక్టర్లు పాల్గొన్నారు.

దుర్గాదేవికి గాజుల అలంకరణ



కాళ్ళ, ఫిబ్రవరి 16 : కోమటిగుంట గ్రామం లో దుర్గాదేవి అమ్మవారికి మాఘమాసం రథ సప్తమి పురస్కరించుకుని సుమారు 54వేల గాజులతో అలంకరించారు. అనంతరం మహి ళా భక్తులు సేవకులచే ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త ఎరుబండి రామాంజనేయులు, రత్నకుమారి దంపతులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

వీరవాసరం , ఫిబ్రవరి 16: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఉత్తరపాలెంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ముందుగా వీరవాసరం ఎల్లమ్మ చెరువు వద్ద నిర్మించిన నూతన సచివాలయం భవనం, రైతు భరోసా కేంద్రం, సంత మార్కెట్ షెడ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం వీరవాసరం పెదపేటలో సీసీ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఉత్తరపాలెంలో సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. సచివాలయ నిర్మాణానికి ఏడు సెంట్లు భూమిని ఇచ్చిన దాతలు చెన్ను సత్యనారాయణ, కోడి వీరన్న, సీహెచ్ వెంకట సత్యనారాయణ, కోడి అప్పారావు, పులి మురళీకృష్ణలను అభినందించారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలను పంపిణీ చేశారు.

సీపీఐ ఉద్యమ నిధికి విరాళాలు సేకరణ

భీమవరం రూరల్, ఫిబ్రవరి 16 : ప్రజాపోరాటాలే ఊపిరిగా పనిచేస్తున్న సీపీఐ ఉద్యమ నిధికి విరివిగా విరాళాలిచ్చి సహకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. కొత్తపూసలమర్రు గ్రామంలో శుక్రవారం నాడు సీపీఐ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి నిధి సేకరణ చేశారు. కార్యక్రమంలో సీపీఐ భీమవరం రూరల్ కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు తిరుమాని కామేశ్వరరావు పాల్గొన్నారు.

మునిసిపల్ దుకాణాల వేలం పాట

నరసాపురం, ఫిబ్రవరి 16: పట్టణంలో కొత్తగా నిర్మించిన మునిసిపల్ ఫిష్ మార్కెట్‌లోని దుకాణాలకు శుక్రవారం కమిషనర్ వెంకటేశ్వరావు వేలం పాట నిర్వహించారు. 20షాపులకు వేలం పాట నిర్వహించగా, ఏడు షాపులు బహిరంగ వేలం ద్వారా పాడుకున్నారు. మిగిలిన 13 షాపులకు పాటదారులు ఆసక్తి చూపకపోవడం వాయిదా వేశారు. ఆర్ఐ నానాజీ పాల్గొన్నారు.

సోనీకి ఎస్ఐ ఉద్యోగం



సోనిని సన్మానిస్తున్న అధ్యాపకులు

నరసాపురం, ఫిబ్రవరి 16: వేములదీవి గ్రామానికి చెందిన బొక్కా సోనీకి ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో ఎస్సై ఉద్యోగం లభించింది. చిన్నతనం నుంచి ఎస్సై కావాలన్న లక్ష్యంతో డిగ్రీ పూర్తి చేసింది. కొచింగ్ తీసుకుని ర్యాంకు సాధించింది. గ్రామంలోని ఎలిమెంట్రీ, హైస్కూల్‌లో చదువుకున్న ఈ విద్యార్థిని పట్టణంలో ఇంటర్, డిగ్రీ సూర్య కాలేజీలో పూర్తి చేసింది. ఉద్యోగం సాధించిన ఈ పూర్వ విద్యార్థిని, తండ్రి వెంకటేశ్వర్లను శుక్రవారం కళాశాల యాజమాన్యంతో పాటు పూర్వ విద్యార్థులు సత్కరించారు. కరస్పాండెంట్ బ్రహ్మాజీ, రామచంద్రరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో తాత్సారం

ఆకివీడు, ఫిబ్రవరి 16: వైసీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలు పట్టించుకోకుండా తాత్సారం చేస్తున్నదని ఎమ్మెల్యే మంతెన రామరాజు మండిపడ్డారు. తహసీల్దార్, అగ్నిమాపకశాఖల కార్యాలయాలు, వాటర్ ట్యాంకు, ఫిల్టర్‌బెడ్, ప్రభుత్వ ఆసుపత్రి మధ్యలో ఉన్న అనధికార డంపింగ్‌యార్డును అంటించడంతో సమీపంలో ఉండలేకపోతున్నామని స్థానికులు ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆయన కమిషనర్ కృష్ణమోహన్‌తో కలిసి పరిశీలించారు. డంపింగ్‌యార్డులోకి ట్రాక్టర్లు వెళ్ళకుండా ఎమ్మెల్యే, కమిషనర్ సమక్షంలో స్థానికులు స్తంభాలు పాతారు. స్తంభాలు తీసేసి చెత్తను తరలిస్తే నేనొచ్చి ఇక్కడే స్థానికులతో కలిసి కూర్చుంటానని హెచ్చరించారు.

ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామరాజు

ఆకివీడు, ఫిబ్రవరి 16: ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం సక్రమంగా అందడం లేదని తమకు ఫిర్యాదులు వస్తున్నాయని ఎమ్మెల్యే రామరాజు అన్నారు. శుక్రవారం స్థానిక సీహెచ్‌సీ (ప్రభుత్వ) ఆసుపత్రిని ఆయన పరిశీలించి ఇన్‌చార్జి ప్రశాంత్‌తో మాట్లాడారు. నాడు-నేడులో భాగంగా ఆసుపత్రి సమీపంలో నిర్మాణంలో ఉన్న అవుట్ పేషెంట్ విభాగం పనులు పూర్తికాకుండా త్వరలో ప్రారంభించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆసుపత్రికి చైర్మన్ అయన నాకు తెలియకుండానే ప్రారంభాలు చేస్తే చూస్తు ఊరుకోనని హెచ్చరించారు. వైద్యుడు వచ్చినా ప్రసూతి ఆపరేషన్లు సక్రమంగా జరగడంలేదని, భీమవరం వెళ్ళమంటున్నారని గర్భిణులు తమ దగ్గర వాపోతున్నారన్నారు. మరలా ఇటువంటి ఫిర్యాదులు వస్తే చర్యలు చేపడతానన్నారు.

అచ్చెన్నాయుడిని కలసిన బాబ్జి

పెంటపాడు, ఫిబ్రవరి 16: తాడేపల్లిగూడెంలో టీడీపీ బలంగా ఉందని, తెలుగుదేశం-జనసేన కూటమి విజయం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారని, ఇదే ఉత్సాహంతో పార్టీ శ్రేణులంతా ముందుకు వెళ్ళాలని సూచించినట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి తెలిపారు. శుక్రవారం విజయవాడ పార్టీ కార్యాలయంలో అయనను మర్యాదపూర్వకంగా కలవగా నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై చర్చించారన్నారు. ఈ సందర్భంగా అచ్చెనాయుడిని సత్కరించినట్టు బాబ్జి తెలిపారు. గొర్రెల శ్రీధర్, పోతుల అన్నవరం, వెంకట్రావు, పరిమి రవికుమార్, దాసరి అప్పన్న, గంధం సతీష్, ఎరుబండి సతీష్ పాల్గొన్నారు.

నూతన రవాణా చట్టం సవరించాలి

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 16: రవాణా రంగంలో మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టంలో సెక్షన్‌లు సవరించాలని డ్రైవర్ల యునియన్ అధ్యక్షుడు ఎస్‌కే బాషా డిమాండ్ చేశారు. భీమవరం శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. మానవ తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాలకు డ్రైవర్లను బాధ్యులను చేస్తూ స్టేషన్లో లొంగి పోవాలని పది సంవత్సరాల జైలు శిక్ష బారీ జరిమానా విధిస్తూ మోదీ తీసుకువచ్చిన చట్టం డ్రైవర్లకు ఉరితాడులా ఉందన్నారు. జరిమానాలు శిక్షలు పెంచినంతమాత్రన ప్రమాదాలు తుగ్గుతాయని చెప్పడం ప్రజలను మోసగించటమే అన్నారు.

కలెక్టర్ ప్రశాంతికి సత్కారం

భీమవరం టౌన్, ఫిబ్రవరి 16 : పశ్చిమ గోదావరి జిల్లా ఆత్మీయతకు మారుపేరని, ఎటు వంటి మంచి కార్యక్రమాలు చేపట్టిన అందరూ సంపూర్ణ సహకారం అందిస్తారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బదిలీపై వెళుతున్న కలెక్టర్ ప్రశాంతిని శ్రీవెంకటేశ్వర స్వామి మందిరం అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి తదితరులు కలిసి ఆత్మీయ సత్కారం చేశారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు చేసే అభివృద్ధి దాతృత్వ కార్యక్రమాలు అద్వితీయమని అన్నారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

పైపులైన్ ఏర్పాటుకు చర్యలు

కాళ్ళ, ఫిబ్రవరి 16 : కోమటిగుంట గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గ్రామ సర్పంచ్ బోణం భాగ్యశ్రీ తెలిపారు. గ్రామ పరిధిలో సూర్యారావు పేటలో పైపులైన్ ఏర్పాటు పనులను శుక్రవారం ప్రారంభించారు. కోమటిగుంట గ్రామ శివారు సూర్యారావుపేటలో ఇటీవల జలజీవన్ మిషన్ నిధులు రూ.35 లక్షలతో ఓహెచ్ఆర్ నిర్మించారు. దీనిలో భాగంగా ఓహెచ్ఆర్‌కు పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. పంచాయతీ నిధులు సుమారు మూడు లక్షలతో పైపులైన్ వేస్తున్నట్లు తెలిపారు.







మోగల్లులో సూర్య నారాయణుడి కల్యాణం.. రావిపాడులో స్వామికి భక్తుల పూజలు.. జుత్తిగలో అలంకరణలో స్వామివారు.. భీమవరంలో బాలా త్రిపుర సుందరికి చిక్కుడు కాయలతో అలంకారం.. పోడూరులో స్వామివారు

వైభవంగా రథసప్తమి వేడుకలు

కన్నుల పండువగా సూర్యనారాయణ స్వామి కల్యాణం

ఆలయాల వద్ద అన్న సమారాధనలు

పాలకోడేరు, ఫిబ్రవరి 16 : మోగల్లు గ్రామం శ్రీసూర్య దేవాలయంలో శుక్రవారం శ్రీసౌజ్ఞ ఛాయ పద్మినీ ఉష సమేత శ్రీసూర్యదేవుని కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజా, విశేష అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి లీలా కల్యాణ మహోత్సవం జరిగింది. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు వెలిచర్ల గణేష్ భానుమంతుడు, కార్యదర్శి వెలిచెర్ల నాగదత్తశర్మ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: పట్టణంలోని బాపు ఘాట్ వద్ద సూర్యభగవన్ ఆలయంలో రథసప్తమి వేడుక ఘనంగా జరిగింది. స్వామివారికి బాపు ఘాట్‌లో కల్యాణం నిర్వహించారు. ఆరేటి వేణు, బెజవాడ రమేష్, చాగంటి ఆనంద్ దంపతులు పీటల మీద కూర్చొని స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. వేదపండితులు మంచిలి దుర్గాప్రసాద్ మంత్రోచ్ఛరణల మధ్య జరిగిన ఈ మహోత్సవానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న ప్రముఖుల్లో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, బొమ్మిడి నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, చాగంటి చిన్న ఉన్నారు. వేలాది మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఇటు మండలంలోని వైఎస్‌పాలెం గ్రామంలో కూడా రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వారిని రథంపై గ్రామంలో ఊరేగించారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు స్వయంగా రథం లాగారు. కమిటీ సభ్యులు వైఎస్ బాబులు, వాసు, కుక్కల మీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు: రథసప్తమి సందర్భంగా రావిపాడు సూర్యభగవానుడి ఆలయంలో ఆలయ ధర్మకర్త పడాల నరసయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు వంగూరి వెంకట సుబ్బారావు, కాజులూరి దుర్గామల్లేశ్వరరావు, అయితం శ్రీనివాస్, వంగూరి శివనాగేశ్వరరావు, జానే వెంకట తాతాజీ, వంగూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెనుమంట్ర: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం జుత్తిగలోని శ్రీ ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి ఆలయంలో ఉన్న శ్రీ సూర్య నారాయణ మూర్తికి ఆలయ అర్చకులు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, కల్యాణం నిర్వహించారు. సోమేశ్వర స్వామికి విశేష అభిషేకాలు, పార్వతీ దేవి అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు.

భీమవరం టౌన్: భీమవరం మెంటేవారితోటలోని శ్రీబాలత్రిపుర సుందరిదేవి అమ్మవారి దేవస్థానంలో రథ సప్తమి సందర్భంగా సూర్య నమస్కారాలు, అమ్మ వారికి చిక్కుడు కాయలతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. నందమూరి ఆంజనేయులు దంపతులు సహకారంతో అమ్మవారికి 10 కేజీల చిక్కుడు కాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు.



తణుకులో బారులు తీరిన భక్తులు

- రథసప్తమి సందర్భంగా గునుపూడిలోని సోమేశ్వర స్వామి ఆలయంలో ఉప ఆలయంలో సూర్యనారాయణ మూర్తికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. తదుపరి పూలతో ప్రత్యేక అలంకారం చేశారు.
- రథసప్తమి సందర్భంగా మహిళలు ఇళ్ళవద్ద ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణమూర్తికి పూజలు చేశారు. ఆవుపిడకల పొయ్యిపై ఆవుపాలతో పరవాన్నం వండి నైవేద్యంగా చిక్కుడు ఆకుల్లో సమర్పించారు. అదేవిధంగా చిక్కుడు కాయలతో రథం తయారుచేసి సూర్యనారాయణ మూర్తిని ఆవాహన చేసి పూజలు చేశారు. ఎరుపు అక్షింతలతో పూజలు చేశారు.

గణపవరం: గణపవరం మండల గ్రామాల్లో రథసప్తమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆధ్యాత్మికవేత్త, రిటైర్డ్ ఉపాధ్యాయుడు అల్లూరి గంగరాజు, వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అత్తిలి: అత్తిలిలో రథసప్తమిని ఘనంగా నిర్వహించారు. విశేష పూజలు, కల్యాణం నిర్వహించారు. మంత్రి కారుమూరి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. సాయంత్రం పుష్పయాగోత్సవం జరిగింది.

ఉండి: వెలివర్రులోని శ్రీవీరపేరాంటాలమ్మ ఆలయ కమిటీ సభ్యుడు రుద్రరాజు సంజీవరాజు దంపతులు తమ నివాసం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం రథసప్తమిని పురస్కరించుకుని వారు తమ నివాసం వద్దనే ఆయా పూజలను చేశారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు విచ్చేసి పూజలలో పాల్గొన్నారు. వీరపేరాంటలమ్మ అమ్మవారి ఆలయకమిటీ చైర్మన్ మంతెన రంగరాజు, కొండరాజు పాల్గొన్నారు.

పాలకొల్లు టౌన్: పాలకొల్లులో సూర్యనారాయణ స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఆలయప్రాంగణంలో స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈనెల 25న అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తణుకు: పట్టణంలోని సూర్యాలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. రథసప్తమి సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారి దర్శనం కోసం భక్తులు క్యూ లైన్లలో వేచి ఉన్నారు. స్వామివారి కల్యాణం, అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





భగ్గేశ్వరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నిమ్మల.. పి.పోలవరంలో పర్యటిస్తున్న పితాని.. తాడేపల్లిగూడెంలో విలేకరులతో మాట్లాడుతున్న వలవల

‘రాజధాని నిర్మించలేని అసమర్థ ముఖ్యమంత్రి’

పోడూరు, ఫిబ్రవరి 16: అమరావతి రాజధాని నిర్మాణం చేయని అసమర్థ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని మాజీమంత్రి పితాని సత్యనారాయణ విమర్శించారు. పి.పోలవరం, జగన్నాథపురం గ్రామాల్లో టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచార పాదయాత్రను నిర్వహించారు. పాదయాత్రలో ప్రతి ఇంటి దగ్గర ఆగి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గణపతినీడి రాంబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, ఎంఎసీ మాజీ వైస్‌చైర్మెన్ రుద్ర రాజు రవి, జనసేన గ్రామాధ్యక్షుడు పిల్లా రాముడు పాల్గొన్నారు.

ఆకివీడు: వైసీపీ అరాచకపాలనకు వాళ్ళ ఎమ్మెల్యే, ఎంపీలే చరమగీతం పలుకుతుంటే సీఎం జగన్ సభలు ఏర్పాటుచేసి పచ్చి అబద్దాలాడుతున్నారని ఎమ్మెల్యే మంతెన రామరాజు దుయ్యబట్టారు. శుక్రవారం 12, 9, 8 వార్డులలో భవిష్యత్ గ్యారెంటీ, ఇంటింటికి తెలుగుదేశం, ఇంటింటికి మన రాంబాబు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పాదయాత్రలో ప్రజావ్యతిరేక పాలనపై కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. బీసీలు, దళితులకు అనే సంక్షేమ పథకాలు రద్దు చేయడ ంతో పాటు ఉపప్రణాళిక నిధులు మళ్లించి అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో మండల-పట్టణ అధ్యక్ష-కార్యదర్శులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, నౌకట్ల రామారావు, గంధం ఉమా, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, కౌన్సిలర్లు బొల్లా వీరశ్వేత, అరుణకుమారి, బత్తుల శ్యామల, అజ్మల్, అబ్బులు, ఆరీఫ్, జాకీర్, మండలాధ్యక్షురాలు బచ్చు సరళాకుమారి, అధికార ప్రతినిధి బొర్రా సుజాత, నరేష్, మరియమ్మ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: రాష్ట్రంలో ఇసుక, విలువైన భూములు, గనులు లూటీ చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు దోచుకున్నాడని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆరోపించారు. భగ్గేశ్వరం గ్రామంలో టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఆయన శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.186కోట్లతో దళితవాడలు, కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టగా ఈ 5ఏళ్ల వైసీపీ పాలనలో ఐదు రూపాయలు పని నోచుకోలేదని విమర్శించారు. పాదయాత్రలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించగా మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. మండల టీడీపీ అధ్యక్షుడు కోడి విజయభాస్కర్, నాయకులు పాముల రజనీకుమార్, రాయి ప్రసాదు, పెన్మెత్స శ్రీనివాసరాజు, అంగర కోటి వీరభద్రం, జనసేన నేతలు శిద్దిరెడ్డి అప్పారావు, బోనం చినబాబు పాల్గొన్నారు.

తణుకు: ప్రజా సమస్యలను బట్టే మేనిఫెస్టో తయారు చేయడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 20న అత్తిలి మండలం కెఎస్ గట్టు గ్రామం నుంచి సకల జనుల చైతన్య పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాదయాత్రగా వెళ్లి గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తిస్తామని, కార్యకర్తలంతా పాల్గొనాలన్నారు. డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, బసవా రామకృష్ణ, కలగర వెంకట కృష్ణ, పితాని మోహన్, తమరాపు రమణమ్మ, తణుకు రేవతి పాల్గొన్నారు. తణుకులో పలువురు యువకులు ఆరిమిల్లి నివాసానికి వచ్చి టీడీపీలో చేరారు.

తాడేపల్లిగూడెం అర్బన్: రాజధాని ఫైల్స్ సినిమాతో ప్రభుత్వ విధ్వంసం ప్రజలకు చేరుతుందని సీఎం జగన్ భయపడుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఆరోపించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ సినిమాలో జగన్ చేసిన విషప్రచారం, అమరావతి విధ్వంసం కళ్ళకు కట్టినట్టు చూపారని, అందుకే సినిమాను ఆపేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారన్నారు. వేల కోట్ల ప్రభుత్వ సంపద ను ఎలా నాశనం చేశారో, మహిళల పట్ల ఎంత అమానుషంగా ప్రవర్తించారు అనే నిజాలు ఈ సినిమా ద్వారా ప్రజల్లోకి వెళ్తాయన్నారు. గంధం సతీష్, సబ్బీను కృష్ణమోహన్, రామ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

గణపవరం: వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసీపీని ఓడించాలని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు కోరారు. వాకపల్లి, వీరేశ్వరపురంలో మన ఇంటికి మన గన్ని కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం అరాచక, విధ్వంసక పాలనలో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. అంతకు ముందు వల్లూరులో క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఇందుకూరి రామకృష్ణంరాజు, యాళ్ళ సుబ్బారావు, అద్దేపల్లి వాసురాజు,కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, నందూరి పెద్దకాపు, నందూరి గాంధీ, కోట చినసత్యం పాల్గొన్నారు.





భీమవరం, ఆకివీడు, నరసాపురంలలో ప్రజా సంఘాల ర్యాలీ..

ప్రజా, రైతు సంఘాల ర్యాలీ

మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 16: రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో చిందిస్తున్న ప్రతి రక్తపు బొట్టుకి మోదీ మూల్యం చెల్లించక తప్పదని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన గ్రామీణ బంద్ పిలుపులో భాగంగా శుక్రవారం భీమవరంలో సీఐటీయు కార్యాలయం నుంచి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగన సభలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు జెఎన్వీ గోపాలన్, ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు, రైతు సంఘాల రాష్ట్ర నాయకులు లంకా కృష్ణమూర్తి, బాబురావు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమల్లోకి తీసుకొచ్చిన కొత్త వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలంటూ శుక్రవారం కిసాన్ మెర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలో రాస్తారోకో చేశారు. గాంధీబొమ్మ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు, ఎం.త్రిమూర్తులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త వ్యవసాయ చట్టాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్నాయన్నారు. గతంలో ఢిల్లీ, హర్యానాల్లో రైతులు ఆందోళన విరమించేందుకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు.

ఆచంట: రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా కార్మిక చట్టాలను మార్చి కార్పొరేట్ సంస్థలకు దోచి పెడుతున్న ప్రధాని నరేంద్రమోదీని గద్దె దించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సార్వత్రిక బంద్ పిలుపులో భాగంగా శుక్రవారం చేపట్టిన మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

ఆకివీడు: బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, మతతత్వ విధానాలను నిరసిస్తూ శుక్రవారం కార్మిక సంఘాలు ర్యాలీ నిర్వహించాయి. సీఐటీయూ మండలాధ్యక్షుడు పెంకి అప్పారావు, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోమోహన్ తోట రామకృష్ణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజా ఉద్యమాలు అణచివేసే ప్రభుత్వాలకు పతనం తప్పదని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం తాడేపల్లిగూడెంలో మోటారు సైకిల్ ర్యాలీ, అలాగే సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు మాట్లాడారు.

వీరవాసరం: దేశ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని నరేంద్రమోదీ ప్రభుత్వం అమలుచేయలేక పోయిందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నర్సింహమూర్తి అన్నారు. శుక్రవారం గ్రామీణ భారత్‌సమ్మెను నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు , నాయకులు ర్యాలీ చేశారు.

పెంటపాడు: పెంటపాడు గేటు సెంటర్ వద్ద సీపీఎం, సీపీఐ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తొలుత గ్రామంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. చిర్లా పుల్లారెడ్డి, కళింగ లక్ష్మణరావు, బంకూరు నాగేశ్వరరావు, బండారు శ్రీనివాసరావు, జే.శ్యామలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం: మోదీ విధానాలను వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అడ్డగర్ల అజయ్‌కుమారి డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కార్మికులు శుక్రవారం ఇరగవరంలో భారత గ్రామీణ బంద్ నిర్వహించారు. రజక సంఘం నాయకుడు ఐ. సత్యనారాయణ, కౌలు రైతు సంఘం నాయకుడు ముసలయ్య, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు నాగబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పిల్లి కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

కోదండ రాముడికి ప్రత్యేక పూజలు

భీమవరం రూరల్, ఫిబ్రవరి 16 : పెదగరువులో శ్రీకోదండరామాలయం రెండో వార్షికోత్సవం రంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి శాంతి కల్యాణం, గోపూజ, విఘ్నేశ్వరపూజ, హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు వత్సవాయి వీరవెంకట సత్యనారాయణరాజు (సత్తిబాబు) దీపకుమారి దంపతులచే జరిగాయి. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

శ్రీవారికి సూర్యప్రభ వాహన సేవ

భీమవరం టౌన్, ఫిబ్రవరి 16 : రథసప్తమి సందర్భంగా జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి వెంకటేశ్వరస్వామికి సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. భక్తులు దర్శించుకుని పూజలు చేసుకున్నారు. ఆలయ ఈవో ఆర్ గంగా శ్రీదేవి, చైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు తదితరులు ఉన్నారు.

రిజిస్టర్డ్ ఫార్మసిస్టులకు శిక్షణ

భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 : శ్రీవిష్ణు ఫార్మసీ కళాశాలలో జిల్లాలో ఉన్న రిజిస్టర్డ్ ఫార్మసిస్టులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి 120 మంది రిజిస్టర్ చేయించుకున్నారు. రోగి ఆరోగ్యంలో ఫార్మసిస్టు నైపుణ్యతలను పెంచుట ఈకార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫార్మసి కౌన్సిల్ ఈసీ మెంబర్ డా.ప్రసాద్‌రెడ్డి, ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డా.విలియం క్యారీ, సమన్వయకర్త పులిపాటి సౌజన్య, ఏపీపీసీ కౌన్సిల్ మెంబర్ దుర్గాప్రసాద్‌లు పాల్గొంటారని విష్ణు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కెఎస్ నటరాజ్ తెలిపారు.

అత్తిలి మండలంలో అభివృద్ధి పనుల ప్రారంభం

అత్తిలి, ఫిబ్రవరి 16 : రాష్ట్ర బడ్జెట్ గత టీడీపీ పాలనలోను, తమ పాలనలో ఒకటే అయినా తమ ప్రభుత్వం మొత్తం సొమ్మును ప్రజల కోసమే ఖర్చు చేస్తే టీడీపీ నామమాత్రంగా ఖర్చుచేసి మిగిలిన సొమ్ము దోచుకుందని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి ఆరోపించారు. శుక్రవారం మంత్రి అత్తిలి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వరిఘేడు, గుమ్మంపాడు, బల్లిపాడు, అత్తిలి, కె.సముద్ర గట్టు, కొమ్మర, స్కిన్నెరపురం గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకంలో మంచినీటి పథకం, సీసీ రహదారులకు శంకుస్థాపన, వెల్‌నెస్ సెంటర్, ఆర్బీకే భవనాన్ని ప్రారంభించారు.

ఉపాధ్యాయుల నిరసన

మొగల్తూరు, ఫిబ్రవరి 16: మూడవ రోజు ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు పాఠశాలల వద్ద ఆందోళన నిర్వహించారు. కాళీపట్నం ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించిన ఆందోళనలో ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మండలంలోని జగన్నాధపురం, పివి తోట, నల్లంవారితోట, కుక్కలవారితోట, జెట్టిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ ఆందోళన నిర్వహించారు.

రామాలయంలో టీడీపీ నాయకుల పూజలు

మొగల్తూరు, ఫిబ్రవరి 16:పేరుపాలెం నార్త్ పంచాయతీ దేవునితోటలోని కోదండ రామాలయంలో టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ తృతీయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, పాలా రాంబాబు, సూర్య కృష్ణ, కవురు ముత్యాలరావు, సత్తినేని బాబ్జి, త్రిమూర్తులు, చల్లా సుబ్రహ్మణ్యం, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆశ్రమ కార్యకలాపాలకు అడ్డుతగిలితే చర్యలు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 16: పడాల అవధూత స్వామి ఆశ్రమంలో వృద్ధులకు ఆశ్రయంతోపాటు పీఠంలో పూజలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని పీఠాధిపతి స్వామి శ్రీ బోధానంద హెచ్చరించారు. ఆశ్రమంలో గురువారం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ ఆధ్వర్యంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1967లో ట్రస్ట్‌గా ఈ ఆశ్రమం నెలకొల్పారని, ఆ సమయంలో ఈ ఆస్తిని దాతలు ఆశ్రమానికి విరాళంగా ఇచ్చారన్నారు. ఇటీవల ఆశ్రమం తమదని కొందరు తమపై దౌర్జన్యం చేసి తమ కార్యకలాపాలకు అడ్డుతగులుతున్నారని దానిపై తాము కోర్టును ఆశ్రయించామన్నారు. అయినా తమను ఇబ్బంది పెడుతుంటే బీజేపీ నాయకులను ఆశ్రయించామన్నారు. తాతాజీ మాట్లాడుతూ కోర్టు తీర్పు ఇచ్చే వరకూ ఆస్తికి వారసులుగా చెప్పుకునేవారు ఆశ్రమంలో ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా ఉండవచ్చన్నారు.

రోడ్డు భద్రతను అతిక్రమిస్తే చర్యలు తప్పవ్

భీమవరం క్రైం, ఫిబ్రవరి 16 : రోడ్డు భద్రతను అతిక్రమిస్తే కఠిన శిక్షలు ఉన్నాయని భీమవరం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రమణ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, రవాణాశాఖ, డీఎన్నార్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2కెవాక్, సదస్సు, ప్రతిజ్ఞ నిర్వహించారు. రమణ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలకు తల్లిదండ్రులు మోటార్ సైకిళ్ళు ఇవ్వరాదని, మద్యం తాగి వాహనం నడపడపడం నేరమని అన్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లారాం సీతారాం రాజు, కొప్పినీడి సూర్యప్రకాషరావు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ప్రసంగించారు. అనంతరం 2కె వాక్ నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బలక్ష్మి, చౌదరి, పి.మణిబాబు, ఎండి బషీర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవి రమణ పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆధార్ సేవలు విస్తృతం చేయాలి

భీమవరం, ఫిబ్రవరి 16 : గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ నమోదు, మార్పులు సేవలను ప్రజలకు విస్తృతంగా అందించాలని ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి బి. శివనా రాయణ రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సంబంధిత అధికారులకు ఒకరోజు వర్కుషాప్ నిర్వహించారు. శివనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించుటకు నిరుపేదలకు ఆధార్ కార్డు మూలమని, దీనిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు నెలకొల్పిందన్నారు. తమ పరిధిలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రతి ఒక్కరికీ, పుట్టిన వారికి కొత్తగా ఆధారు నమోదు చేయుట, తప్పులు ఉంటే సరిచేయాలన్నారు.